ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
గురువారం, 01 అక్టోబర్ 2026 | సంపుటి: 02 | సంచిక: 43 | పేజీలు: 4 | వెల: 5


## సింగరేణిని అవినీతిమయం చేశారు



- సంస్థను కాంగ్రెస్ సర్కార్ నాశనం చేస్తోంది
- కోల్ బెల్ట్‌లో బొగ్గు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు
- సింగరేణి 51 శాతం వాటాను ప్రైవేట్‌కు అప్పగించే కుట్ర
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**కాకతీయ, హైదరాబాద్:** సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. సింగరేణి 51 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిని ఎవరికైనా అప్పగిస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని

........(తరువాయి 2లో)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలే ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు బీమా, పెన్షన్లు, మహిళలకు రూ.2,500 హామీ, యూరియా సమస్యలపై ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పాదయాత్ర చేపట్టి ప్రజలను నేరుగా కలుస్తానని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన పరిణామాలు, పదవులు చేజారిన సందర్భాలు, భూపాలపల్లి అభివృద్ధి, బీఆర్ఎస్‌లో చేరిక, కుటుంబం, భవిష్యత్ రాజకీయ అడుగులపై తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



## ప్రజలతో బంధమే నా బలం

### రేవంత్ సర్కార్‌కు అనస్థీషియా తప్పదు

### కాంగ్రెస్ హామీలన్నీ మోసాలేనని ప్రజలు గుర్తించారు



- నా పనితీరే నా రాజకీయ ఎదుగుదలకు కారణం
- భూపాలపల్లే నాకుటుంబం..మళ్లీ పాదయాత్రతో ప్రజల్లోకి
- నా రాజకీయ ప్రయాణంలో అనేక కుట్రలు ఎదుర్కొన్నా
- రెండు సార్లు మంత్రి పదవి వచ్చినట్లే వచ్చి చేజారింది
- ప్రజలతో నేరుగా సత్సంబంధాలే నా రాజకీయ బలమని నమ్ముతా
- నా కొడుకు గౌతమ్ రాజకీయాల్లోకి వస్తానంటే స్వాగతిస్తా
- డిజిటల్ మీడియా ప్రతినిధుల చిట్‌చాట్‌లో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

4



2

మన కరెంటు.. రాజస్థాన్‌కు

### ధారాదత్తమా?

- జైపూర్ విద్యుత్ జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని రద్దు చేయాలి
- 800 మెగావాట్ల కరెంటు తెలంగాణకే ఇవ్వాలి
- మన బొగ్గు.. మన నీళ్లు.. కరెంటు మాత్రం రాజస్థాన్‌కా
- విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరతను నివారించాలి
- ఎన్‌టీపీసీ విద్యుత్‌పై వెంటనే పీపీఏ చేసుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు



2

### రోడ్డు ఆక్రమిస్తే డ్రైనేజీ ఎక్కడ?

- ప్రణాళిక లేని కట్టడాలతో మునకలో వరంగల్
- రెండో రాజధాని సౌందర్యానికి అక్రమ నిర్మాణాల గ్రహణం
- నిబంధనలు పాటించేవాడే బలి?



## సిరిసిల్లలో గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తాం



### సిరిసిల్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

- విజేతకు మంత్రి పదవి ఇప్పించే బాధ్యత నాది
- నేతన్నలకు రూ.1,741 కోట్లతో చేయూత
- జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు
- గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ
- సిరిసిల్ల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**కాకతీయ,తెలంగాణ బ్యూరో/ సిరిసిల్ల:** రానున్న ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఢిల్లీ హైకమాండ్‌ను ఒప్పించి మంత్రివర్గంలోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ప్రజాపాలనలో నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇప్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జూనియర్ కళాశాల మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ జి. మహేష్‌బాబాసాహెబ్ స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు పాదయాత్ర నిర్వహించారు. సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయమని, అయితే పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారిందని రేవంత్‌రెడ్డి అన్నారు. వస్త్ర పరిశ్రమకు సిరిసిల్ల అసలైన చిరునామా అని, వేలాది కుటుంబాలు చేనేత, పవర్లూమ్

........(తరువాయి 2లో)

## కరెంటివ్వక.. పంటలు ఎండగొట్టారు

### ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి

- విద్యుత్ శాఖ వైఫల్యంతో అన్నదాతకు నష్టం
- బోర్లు నడవక కళ్లముందే ఎండుతున్న పంటలు
- ఫసల్ బీమా అమలు చేయక రైతులకు అన్యాయం
- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ సర్కారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు



**కాకతీయ, నల్గొండ:** ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యుత్ శాఖ వైఫల్యంతోనే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. పంటలు కాపాడుకునేందుకు సకాలంలో నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఎండిపోయిన పంటలను క్షేత్రస్థాయిలో సర్వే చేయించి నష్టపోయిన ప్రతి రైతుకు వెంటనే తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా చిన్న మాదారం గ్రామంలో రాంచందర్‌రావు పంట పొలాలను పరిశీలించారు. నీరందక ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం చిన్న మాదారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా వివరాలపై అధికారులను ఆరా తీశారు.

**పంటలు ఎండిపోతున్నాయ్**

సకాలంలో సరైన విద్యుత్ సరఫరా లేక బోర్లు నడవక, పొలాలకు నీరందక చేతికొచ్చిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని రాంచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి ఒక్క గ్రామానికే పరిమితం

........(తరువాయి 2లో)

## బెగులూరు క్వారీలో డబుల్ రేటు దందా

- ఇసుక లోడింగ్‌పై అదనపు బాదుడు
- డీడీ కట్టినా లోడింగ్ పేరుతో అదనపు బాదుడు
- దొడ్డు ఇసుకకు రూ.2500.. సన్న రకానికి రూ.5000 అదనం
- ఇష్టారాజ్యంగా క్వారీ కాంట్రాక్టర్ తీరు
- అంతా పీవోకు తెలిసే జరుగుతోందా..?!



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ఇసుక బుక్ చేసుకుని డీడీ చెల్లించినా.. మహదేవ్‌పూర్ మండలం బెగులూరు క్వారీలో మాత్రం అదనపు బాదుడు తప్పడం లేదు. ఇసుక లోడింగ్ పేరుతో దొడ్డు రకానికి రూ.2500, సన్న రకానికి రూ.5000 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. అధికారిక చెల్లింపులకు అదనంగా ఈ మొత్తాలను ఎందుకు తీసుకుంటున్నారు? లోడింగ్ చార్జీల పేరుతో

........(తరువాయి 2లో)



## బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు

### తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే

- కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం
- డీలిమిటేషన్‌లో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగొద్దు
- కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- ఎన్నికల సంఘం విశ్వసనీయతపై అనేక ప్రశ్నలు
- ఇండియా టుడే సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీజేపీతో బీఆర్ఎస్‌కు ఎలాంటి పొత్తు ఉండదని తేల్చిచెప్పారు. గత 26 ఏళ్లలో బీజేపీతో తమ పార్టీ ఒక్కసారి కూడా పొత్తు పెట్టుకోలేదని, 2014, 2018, 2023 ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసిందని తెలిపారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే సదస్సులో ఆయన మాట్లాడారు. బీజేపీతో పొత్తు ఎందుకు పెట్టుకోవాలన్న ప్రశ్నకు భావజాలపరంగా, సైద్ధాంతికంగా బీఆర్ఎస్ ఆ పార్టీకి వ్యతిరేకమని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. 2023 ఎన్నికల్లో 420కి పైగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిలో ఒక్కదానినీ పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్ఆర్ఆర్ అంటే రీకాల్, రిగ్రెట్, రివోల్ట్ పరిస్థితి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు పునరాలోచిస్తున్నారని, ఆ అసంతృప్తి తిరుగుబాటు దిశగా మారుతోందని చెప్పారు.

**డీలిమిటేషన్‌లో దక్షిణాదికి నష్టం వద్దు**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జనాభా ఆధారిత డీలిమిటేషన్‌ను కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా గతంలో సుమారు 24 శాతం ఉండగా, ప్రస్తుతం 19 శాతానికి

........(తరువాయి 2లో)

# సిరిసిల్లలో గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నాయని చెప్పారు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన చీరలను తయారు చేసే నైపుణ్యం ఇక్కడి నేతన్నల సొంతమన్నారు.

**గత పాలనపై విరుచుకుపడ్డ సీఎం**

2009 నుంచి 2023 వరకు అరడజను సార్లు జరిగిన ఎన్నికల్లో కేటీఆర్ గెలిచినా చేనేత కార్మికుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కార్మికుల గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదని నిలదీశారు. గల్ఫ్ దేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురాలేని పరిస్థితి గత పాలనలో ఉండేదన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చామని, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. గత పాలకులపై అవినీతి ఆరోపణలు చేస్తూ, కల్వకుంట్ల కుటుంబం లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అమెరికాలో ఎన్ని బాత్రూంలు కడిగారో, వేల కోట్లు ఎలా సంపాదించారో కేటీఆర్ వెల్లడించాలని వ్యాఖ్యానించారు. గోదావరి జలాలను అడ్డం పెట్టుకుని మానేరు ఇసుకను దోచుకున్నారని ఆరోపిస్తూ నేరెళ్ల బాధితులు ఇందుకు సజీవ సాక్ష్యమన్నారు. మిడ్‌మానేరు డ్యాం ముంపులో ఇళ్లు కోల్పోయిన కేసీఆర్ కుటుంబ సభ్యులకు ఇళ్ల స్థలాలు లభించలేదా అని ప్రశ్నించారు.

**ప్రజాపాలనలో భారీగా నిధులు**

వెయ్యి రోజుల ప్రజాపాలనలో నేత కార్మికుల కోసం రూ.1,741 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు చేశామని చెప్పారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశామని, రాజన్న ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సిరిసిల్ల, వేములవాడలో రూ.200 కోట్ల చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. సిరిసిల్లలో నేత బజారు నిర్మాణానికి, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల పనులకు శ్రీకారం చుట్టారు. పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం, వేములవాడ మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ, సిరిసిల్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించారు.





**రైతులు, పేదల సంక్షేమమే లక్ష్యం**

రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, రుణమాఫీ కింద రూ.20,614 కోట్లు రైతులకు చెల్లించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించామన్నారు. రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కోటి 6 లక్షల కుటుంబాలకు చెందిన 3 కోట్ల 46 లక్షల మంది లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని చెప్పారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని, ఇందుకోసం ప్రభుత్వం రూ.12 వేల కోట్లు చెల్లించిందన్నారు. ఈ పండుగకు చిలక చీరలను పంపిణీ చేస్తామని తెలిపారు.

**నేతన్నలకు చేతినిండా పని**

సిరిసిల్ల నేతన్నలకు గత పాలకులు పెట్టిన బకాయిలను ప్రజా ప్రభుత్వం చెల్లించిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా రూ.50 కోట్ల మేర రుణాలు మాఫీ చేశామని, వేములవాడలో రూ.50 కోట్లతో నూలు డిపో ఏర్పాటు చేశామని చెప్పారు. ఏడాది పొడవునా చేతినిండా పని ఉండేలా ప్రభుత్వమే ఆర్డర్లు కల్పిస్తోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు, ప్రజలు, నేతన్నల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ నేతన్నలు, ముంపు గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నేరెళ్ల బాధితులకు పరిహారం అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**మార్పు వస్తోంది.. మంత్రి పదవి ఇస్తా**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మార్పు రాబోతోందని రేవంత్‌రెడ్డి అన్నారు. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో ఒక పద్మశాలి బిడ్డను శాసనమండలికి పంపించాలని కోరారు. సిరిసిల్ల నుంచి కాంగ్రెస్ తరఫున గెలిచిన అభ్యర్థికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని మరోసారి స్పష్టం చేశారు. కుటుంబ పాలన కావాలో, ప్రజాపాలన కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని అన్నారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలన 2 తెలంగాణలో తప్పనిసరిగా వస్తుందని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. అనంతరం నేరెళ్ల బాధితులకు ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ఆక్రమిస్తే డ్రైనేజీ ఎక్కడ?

- ప్రణాళిక లేని కట్టడాలతో మునకలో వరంగల్
- రెండో రాజధాని సౌందర్యానికి అక్రమ నిర్మాణాల గ్రహణం
- నిబంధనలు పాటించేవాడే బలి?

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం, రెండో రాజధానిగా గుర్తింపు పొందిన వరంగల్ లో అక్రమ నిర్మాణాలు నగర సౌందర్యాన్ని మసకబారుస్తున్నాయి. ప్రణాళికాబద్ధ అభివృద్ధికి ఇవి పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. నగరాభివృద్ధి నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలకు తప్పనిసరిగా సెట్ బ్యాక్ ఉండాలి. దీనివల్ల డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ సౌకర్యాలు, రోడ్డు విస్తరణ వంటి ప్రజా మౌలిక వసతులు కల్పించడం సులభమవుతుంది. కానీ నాని గార్డెన్స్ సమీపంలోని నిర్మాణంలో ఈ నిబంధనలను పూర్తిగా విస్మరించారు. "ఇప్పటికే వర్షాకాలంలో నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు మొత్తం భవనాలతో ఆక్రమిస్తే మురుగునీటి పారుదల పూర్తిగా దెబ్బతింటుంది. డ్రైనేజీ కాలువలు ఎక్కడ నిర్మిస్తారు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరణ అవసరం వచ్చినా ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిజాయితీపరులకు శిక్ష, అక్రమార్కులకు రక్షణ?**

నిబంధనలు పాటించే సామాన్యుడు అనుమతుల కోసం కార్పొరేషన్ చుట్టూ నెలల తరబడి తిరుగుతుంటే, నిబంధనలు ఉల్లంఘించే వారికి మాత్రం ఎలాంటి అడ్డంకులు లేకపోవడం గమనార్హం. నిబంధనలు పాటించే వారికంటే ఉల్లంఘించే వారికే ప్రాధాన్యం లభిస్తోందనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోతోంది. ఉరుసు గుట్ట సమీపంలోని శ్రీలక్ష్మి కార్ జోన్ పక్కనే జరుగుతున్న భారి నిర్మాణాన్ని వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రోడ్డు ఆక్రమణ జరిగి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ ను కోరుతున్నారు. నగరంలో జరుగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా రహదారులను పరిరక్షించడం, భవిష్యత్ తరాలకు ప్రణాళికాబద్ధమైన నగరాన్ని అందించడం అధికారుల బాధ్యత అని వారు గుర్తు చేస్తున్నారు.

# బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు

(మొదటిపేజీ తరువాయి)

తగ్గిందని తెలిపారు. పార్లమెంట్ సీట్లు పెంచాలనుకుంటే అసెంబ్లీ స్థానాలను కూడా ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. దామాషా ప్రకారం సీట్లు పెంచితేనే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. అస్సాం, జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ సీట్లు పెంచినప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎందుకు పెంచలేదని కేటీఆర్ ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ రాజకీయ ప్రభావం తక్కువగా ఉండటంతోనే సీట్ల పెంపును పట్టించుకోవడం లేదన్న అనుమానాలు ఉన్నాయని అన్నారు. డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇచ్చిన హామీలపై తమకు నమ్మకం లేదని పేర్కొన్నారు.

**రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు**

రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల ప్రయోజనాల కంటే ఢిల్లీ నాయకత్వానికి విధేయత చూపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని అన్నారు. రాముడు, శివుడిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, బీజేపీ మత ప్రాతిపదికన దేశాన్ని విభజించాలనుకుంటే, కాంగ్రెస్ ముఖ్యమంత్రి దేవుళ్ల ప్రాతిపదికన విభజిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇదేనా




రెండు జాతీయ పార్టీల ఎజెండా అని ప్రశ్నించారు. ఉద్యోగాల కల్పన, హామీల అమలు, అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ఎందుకు చర్చించడం లేదని నిలదీశారు. 2022 నాటికే ప్రతి ఇంటికీ మంచినీరు, బుల్లెట్ రైళ్లు, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వంటి లక్ష్యాలు సాధించాల్సి ఉండగా, వాటి పరిస్థితి ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించకుండా యూసీసీ, వందేమాతరం వంటి అంశాలపై దృష్టి పెట్టడం ఎందుకని అన్నారు.

**ఎస్ఐఆర్‌పై పారదర్శకత అవసరం**

ఎన్నికల సంఘం విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా మారిందని కేటీఆర్ అన్నారు. ఎన్నికల సంఘంలో జరుగుతున్న పరిణామాలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ జరిపించాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో స్వతంత్ర దర్యాప్తు చేయించాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన నైతిక బాధ్యత వహించి పదవి నుంచి తప్పుకోవాల్సిందని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేయడం అవసరమేనని, అయితే ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ గెలిచిన 39 నియోజకవర్గాల్లోనే అత్యధిక ఓట్లు తొలగించారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌పై నెలకొన్న అనుమానాలు, ఆందోళనలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని కోరారు.

**యువత ప్రశ్నలకు సమాధానం చెప్పాలి**

జెన్‌జీ ఉద్యమాలపై స్పందించిన కేటీఆర్, దేశంలో యువత ఉద్యమించడం కొత్తేమీ కాదని, తెలంగాణ ఉద్యమం కూడా అదే తరహాలో సాగిందని అన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై యువత, ముఖ్యంగా జెన్‌జీ తీవ్ర ఆగ్రహంతో ఉందని చెప్పారు. సమస్యలపై యువత ప్రశ్నిస్తుంటే కేంద్ర ప్రభుత్వం దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం యువత ప్రశ్నిస్తుంటే పట్టించుకోవడం లేదని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ ఇచ్చిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. ఉద్యోగాలపై సమాధానం ఇవ్వకుండా దృష్టి మళ్లించడం సరికాదని, ఇంకెంతకాలం మతం పేరుతో దేశాన్ని విభజిస్తారని ప్రశ్నించారు.

# మన కరెంటు.. రాజస్థాన్‌కు ధారాదత్తమా?

- జైపూర్ విద్యుత్ జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని రద్దు చేయాలి
- 800 మెగావాట్ల కరెంటు తెలంగాణకే ఇవ్వాలి
- మన బొగ్గు.. మన నీళ్లు.. కరెంటు మాత్రం రాజస్థాన్‌కా
- విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరతను నివారించాలి
- ఎన్‌టీపీసీ విద్యుత్‌పై వెంటనే పీపీఏ చేసుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు




**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో 800 మెగావాట్లను రాజస్థాన్‌కు కేటాయించే జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి, ఆ విద్యుత్‌ను వంద శాతం తెలంగాణ అవసరాలకే వినియోగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు కరెంటు, సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే తెలంగాణలో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రానికి తరలించేందుకు ప్రభుత్వం సిద్ధపడటం ప్రజా వ్యతిరేక చర్య అని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల్లోనే ఉందని, నీరు పక్కనే ఉన్న గోదావరి నుంచి అందుబాటులో ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. బొగ్గు తెలంగాణది, నీళ్లు తెలంగాణవి, స్థలం తెలంగాణదేనని, అలాంటప్పుడు కొత్తగా చేపడుతున్న విస్తరణలో 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు కేటాయించే ఒప్పందం ఎందుకు చేసుకున్నారని ప్రశ్నించారు. మన బొగ్గు, మన నీళ్లు, మన ప్రాంతంలో ఉత్పత్తయ్యే విద్యుత్‌పై హక్కు తెలంగాణ ప్రజలదేనని అన్నారు.

**రూ.22 వేల కోట్ల ప్రాజెక్టు ఎందుకు**

సింగరేణి సంస్థ రాజస్థాన్‌కు చెందిన ఆర్ఆర్‌వీయూఎన్ఎల్ విద్యుత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్‌లో 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయిస్తారని హరీశ్‌రావు తెలిపారు. అంతేకాక రాజస్థాన్‌లో 1,500 మెగావాట్ల భారీ సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు కూడా సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. దాదాపు రూ.22 వేల కోట్ల భారీ ప్రాజెక్టులో తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణి విద్యుత్, పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలన్నదే తమ ప్రశ్న అని అన్నారు. రాష్ట్రంలోనే విద్యుత్ అవసరాలు తీవ్రంగా ఉన్న సమయంలో ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్ లోటును అధిగమించేందుకు కేసీఆర్ ముందుచూపుతో విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించారని, వాటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సక్రమంగా అందించలేకపోతోందని విమర్శించారు.

**రైతులకు కరెంటు లేదు.. రాజస్థాన్‌కు ఇస్తారా**

రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేకపోతోందని హరీశ్‌రావు ఆరోపించారు. విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతుంటే పాలనా వైఫల్యాన్ని ఎల్‌నినోపై నెట్టివేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ నిర్వహణ లోపాల వల్లే రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాలు కునారిల్లుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ నిర్మించిన 4,000 మెగావాట్ల యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సగానికి పడిపోయిందని పేర్కొన్నారు. జీ10, జీ11 నాణ్యత గల బొగ్గు వాడాల్సి ఉండగా జీ13, జీ14 నాణ్యత గల బొగ్గును వినియోగించడం వల్ల బాయిలర్లు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. బొగ్గు కొరతతో కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 45 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండాలన్న నిబంధన ఉందని, కనీస నిల్వలు ఉంచకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నప్పుడు విద్యుత్ కేంద్రాల వద్ద కొరత ఎందుకు ఏర్పడుతోందని ప్రశ్నించారు. ఈ పరిస్థితులను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వెళ్తే పోలీసులతో అడ్డుకోవడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.

**ఎన్‌టీపీసీ విద్యుత్‌ను ఎందుకు వద్దన్నారు**

రాష్ట్ర విభజన సమయంలో ఎన్‌టీపీసీ ద్వారా తెలంగాణకు 4,000 మెగావాట్ల విద్యుత్ ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని హరీశ్‌రావు తెలిపారు. అందులో భాగంగా ఎన్‌టీపీసీ 1,600 మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్రానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రానికి అదనపు భారం లేకుండా లభించే విద్యుత్‌ను ప్రభుత్వం ఎందుకు వద్దన్నదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్‌తో చేసుకున్న విద్యుత్ జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. జైపూర్‌లో ఉత్పత్తయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను వంద శాతం తెలంగాణ వినియోగించుకునేలా రాష్ట్ర డిస్కంలతో పీపీఏ ఒప్పందం చేసుకోవాలని కోరారు. యాదాద్రి, భద్రాద్రి, కొత్తగూడెం విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరత లేకుండా పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర విభజన హామీ మేరకు ఎన్‌టీపీసీ నుంచి తెలంగాణకు రావాల్సిన విద్యుత్ కోసం తక్షణమే పీపీఏ ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రైతులు, ప్రజలు కరెంటు కష్టాలు ఎదుర్కొంటున్న సమయంలో జైపూర్ విద్యుత్‌ను రాజస్థాన్‌కు కేటాయించే నిర్ణయాన్ని ప్రభుత్వం పునరాలోచించాలని హరీశ్‌రావు కోరారు. తెలంగాణ అవసరాలకు విద్యుత్‌ను పూర్తిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించి రాజస్థాన్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోకపోతే రాష్ట్ర ప్రయోజనాల కోసం రైతులు, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

## బెగులూరు క్వారీలో డబుల్ రేటు దందా

(మొదటిపేజీ తరువాయి)

ఇంత భారీగా వసూలు చేయడానికి అనుమతి ఉందా? ఉంటే ఆ వివరాలను ఎందుకు వెల్లడించడం లేదు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక పొందుతున్న వినియోగదారుడిపై క్వారీ వద్ద మళ్లీ వేల రూపాయల భారం పడుతోంది. దీంతో బెగులూరు క్వారీలో కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది.

**డీడీ చెల్లించినా దోపిడీ**

ఇసుకను అధికారికంగా పొందేందుకు వినియోగదారుడు ఆన్‌లైన్‌లో టన్నుకు రూ.375 చెల్లించి బుకింగ్ చేసుకుంటున్నాడు. ఆ మొత్తం తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ఖజానాలో జమవుతుంది. ప్రభుత్వం నిర్దేశించిన విధానంలో చెల్లింపు పూర్తయిన తర్వాత వాహనం క్వారీకి చేరుకుంటుంది. అక్కడ ఇసుక లోడింగ్ కోసం మరోసారి డబ్బులు చెల్లించాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. దొడ్డు ఇసుకకు రూ.2500, సన్న ఇసుకకు రూ.5000 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం నిర్ణయించిన ధర, అనుమతించిన చార్జీల ప్రకారమే వ్యవహారం సాగాలి. కానీ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అదనపు వసూళ్లను యథేచ్ఛగా సాగిస్తుండటం గమనార్హం. నిత్యం వందల లారీల్లో ఇసుక రవాణా జరుగుతుండటంతో అక్రమంగా లక్షల రూపాయాలు కాంట్రాక్టర్ జేబుల్లోకి వెళ్తున్నట్లు సమాచారం.

**పర్యవేక్షణ ఏమైనట్లు**

ఇసుక క్వారీల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించిన పలు చర్యలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్న బెగులూరు క్వారీ వ్యవహారంతో మరోసారి ముందుకొచ్చింది. వాహనాలకు జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ, లోడింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో తనిఖీలు చేపడతామని ప్రకటించారు. మరి ఇంతటి పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ క్వారీలో అదనపు వసూళ్లు జరుగుతున్నట్లు తెలుస్తుండటం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది. వాహనం క్వారీలోకి వచ్చినప్పటి నుంచి లోడింగ్ పూర్తయ్యే వరకు జరిగే వ్యవహారాన్ని అధికారులు పరిశీలిస్తే అదనపు వసూళ్లను గుర్తించడం పెద్ద కష్టమేమీ కాదు.

**పీవోకు తెలిసే జరుగుతోందా**

బెగులూరు క్వారీలో అదనపు వసూళ్ల వ్యవహారం సంబంధిత పీవో పర్యవేక్షణపైనా ప్రశ్నలు లేవనెత్తుతోంది. పీవోకు తెలియకుండానే క్వారీ స్థాయిలో ఈ వ్యవహారం సాగుతోందా? తెలిసినా పట్టించుకోవడం లేదా? కాంట్రాక్టర్ తీరుపై ఎప్పుడైనా తనిఖీలు నిర్వహించారా? అన్నది తేలాల్సి ఉంది. క్వారీని ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనదారుల నుంచి వివరాలు సేకరించడంతోపాటు చెల్లింపుల ఆధారాలు, రసీదులు, లోడింగ్ రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. బెగులూరు క్వారీలో అదనపు వసూళ్లపై జిల్లా యంత్రాంగం తక్షణమే విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. కేవలం క్వారీ నిర్వాహకుల వివరణ తీసుకోవడం కాకుండా ఇసుక కొనుగోలు చేసిన వాహనదారుల నుంచి నేరుగా వివరాలు సేకరించాలి. అధికారికంగా చెల్లించిన మొత్తం, క్వారీ వద్ద వసూలు చేసిన అదనపు మొత్తం, వాటికి ఇచ్చిన రసీదులు, లోడింగ్ చార్జీలకు ఉన్న నిబంధనలను పరిశీలించాలి. అదనపు వసూళ్లు నిబంధనలకు విరుద్ధమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కరెంటివ్వక.. పంటలు ఎండగొట్టారు

(మొదటిపేజీ తరువాయి)

కాలేదని, ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు కృష్ణా పరీవాహక ప్రాంతం, యావత్ తెలంగాణలో రైతులు విద్యుత్, సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. ఎకరాకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులకు ఆ పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. రైతులకు సకాలంలో నాణ్యమైన కరెంటు అందించడమే కాకుండా పంట నష్టానికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ సర్కారు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడిందని విమర్శించిన రాంచందర్‌రావు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆరోపించారు. రైతుల దుస్థితికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, తాము చేసిన తప్పిదాలపై పాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఎండిపోయిన పంటలను ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో సర్వే చేయించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి తగిన పరిహారం అందజేయాలని కోరారు. రైతులు ఎకరాకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా నష్టపరిహారం చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని అన్నారు.

**రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తాం**

రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని రాంచందర్‌రావు విమర్శించారు. విద్యుత్, సాగునీటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. రైతుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. చిన్న మాదారం పర్యటనలో రైతుల నుంచి స్వయంగా సమస్యలను తెలుసుకున్నామని, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతుల పంటలు ఎండిపోతున్న పరిస్థితిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ఎన్.రాంచందర్‌రావు కోరారు. విద్యుత్ సరఫరాలో లోపాలను సరిదిద్ది, పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల పెట్టుబడులు, పంట దిగుబడులు దెబ్బతిన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## సింగరేణిని అవినీతిమయం చేశారు

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించారు. సింగరేణిని అవినీతిమయం చేశారని, సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డి కింగ్‌పిన్‌గా అవినీతి జరుగుతోందని బాల్క సుమన్ ఆరోపించారు. జైపూర్ పవర్‌ప్లాంట్‌లో 334 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతోందని, సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని ఆరోపించారు. ఒక్కో కార్మికుడికి లాభాల్లో రూ.1.80 లక్షల మేర తక్కువగా ఇస్తున్నారని అన్నారు. సింగరేణి నిధులను సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ షోలకు ఖర్చు చేశారని విమర్శించారు.

**రూ.60 వేల కోట్ల బకాయిలు**

సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్ల బకాయి పడిందని బాల్క సుమన్ తెలిపారు. బొగ్గు ఉత్పత్తి తగ్గిపోతోందని, విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. డిప్యూటీ సీఎం, అధికారులు, బంధువులు కలిసి విదేశీ బొగ్గు సరఫరా చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారసత్వ ఉద్యోగాలు నిలిపివేశారని అన్నారు. కార్మికులకు నికర లాభాల్లో 36 శాతం వాటా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారని చెప్పారు. సింగరేణి అంటే సిరుల గని అని, తెలంగాణ ఉద్యమ సమయంలో కార్మికులు బొగ్గు ఉత్పత్తి నిలిపివేయడంతో దక్షిణ భారతదేశంలో విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు ఏర్పడ్డాయని బాల్క సుమన్ గుర్తుచేశారు. ప్రతి నెల 3 సార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 5న తెలంగాణ భవన్‌లో సింగరేణి కోల్ బెల్ట్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్మిక సంఘాల నేతలతో కేటీఆర్ సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు.

**నీళ్ల విషయంలోనూ అన్యాయం**

రాష్ట్రానికి 45 టీఎంసీల కృష్ణా నీటిని ఇవ్వొద్దని చంద్రబాబు సీడబ్ల్యూసీకి లేఖలు రాస్తున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. నాన్ బేసిన్ కుప్పానికి కృష్ణా నీటిని తరలించారని విమర్శించారు. గురువు కళ్లల్లో ఆనందం కోసం రేవంత్‌రెడ్డి తెలంగాణను ఎండబెడుతున్నారని వ్యాఖ్యానించారు. సిరిసిల్లకు కేటీఆర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు ఎన్ని నిధులు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డికి మైక్ దొరికితే తిట్టడం తప్ప మరో పని లేదని విమర్శించారు. సిరిసిల్లకు ఆయన టూరిస్టులా వస్తున్నారని అన్నారు. నాయకులను ఓడించేది, గెలిపించేది ప్రజలేనని, టూరిస్టులు కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చుట్టూనే రేవంత్‌రెడ్డి రాజకీయం తిప్పుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మరో 20 ఏళ్లు కాంగ్రెస్ మొలకెత్తదని బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. ప్రెస్‌మీట్‌లో చిరుమళ్ల రాకేష్‌కుమార్, కౌశిక్ హరి, కె.కిషోర్‌గౌడ్, బొమ్మెర రామమూర్తి, కురువ విజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## హుజూరాబాద్ సమస్యలను పరిష్కరించాలి

- నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,000 కోట్లు మంజూరు చేయాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్

**కాకతీయ, హుజూరాబాద్:** హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. దళితబంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని, నియోజకవర్గ అభివృద్ధి పనులకు రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. కమలాపూర్ బస్టాండ్ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.కోటి వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతాంగ ప్రయోజనాల కోసం కల్వల ప్రాజెక్టుకు వెంటనే ఆమోదం తెలిపి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇసుక క్వారీల కారణంగా దెబ్బతిన్న ప్రధాన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## అబద్ధాలు, విద్వేషాలతో సీఎం రేవంత్ కాలక్షేపం

- సిరిసిల్ల సభలో కేసీఆర్, కేటీఆర్‌పై దిగజారుడు వ్యాఖ్యలు
- వ్యక్తిగత విమర్శలతో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధ్వజం



**కాకతీయ, ఖమ్మం :** అబద్ధాలు, విద్వేషాలు, దూషణలతో కాలక్షేపం చేస్తూ రాష్ట్రంలో పరిపాలనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాలికి వదిలేశారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. సిరిసిల్ల సభలో కేసీఆర్, కేటీఆర్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ఆవేశానికి లోనై కేసీఆర్, కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి గౌరవం, సంస్కారం పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందని పువ్వాడ అన్నారు. అందుకు భిన్నంగా వ్యక్తిగత విమర్శలు, అసభ్య పదజాలంతో మాట్లాడటం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, పరిపాలనలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

## ప్రశ్నపత్రాల బాహ్య మూల్యాంకన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



**కాకతీయ, నెల్లికుదురు:** ప్రశ్నపత్రాల బాహ్య మూల్యాంకన నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో యాకయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేటివ్ పరీక్ష పత్రాలను మండల కేంద్రాల్లో మూల్యాంకనం చేయడం వల్ల విద్యార్థులు మార్కులు, గ్రేడ్ల కోసం పరుగెత్తే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విధానం ఉపాధ్యాయులను కించపరిచేలా ఉందని, ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. సబ్జెక్టు టీచర్ అందుబాటులో లేకుండానే విద్యార్థులు పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. విద్య అంటే మూల్యాంకనం మాత్రమే అన్నట్లుగా విద్యాశాఖ వ్యవహరించడం సరికాదని, విద్యా లక్ష్యాలకు విరుద్ధమైన విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పద్మావతి, రాజు, నవీన్ పాల్గొన్నారు.

## పసికందు మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు



**కాకతీయ, శంకరపట్నం:** శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో పసికందు మృతదేహం లభ్యమవడం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు చిన్న గుంత తవ్వి అందులో మృతదేహాన్ని ఉంచినట్లు తెలుస్తోంది. అనంతరం కుక్కలు మృతదేహాన్ని బయటకు లాగి పీక్కుతిన్నాయి. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని అక్కడ ఉంచిన వ్యక్తులను గుర్తించి పూర్తి వివరాలు వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఘటనాస్థలంలో సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్, వార్డు సభ్యుడు మోయిన్ తదితరులు ఉన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

## ఉద్యమంలో కనకం నాగయ్య కీలక పాత్ర

**మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**



**కాకతీయ, శంకరపట్నం:** తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికి చెందిన కనకం నాగయ్య మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో ముత్తారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన ఉద్యమంలో నాగయ్య చురుకుగా పాల్గొన్నారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. 2011లో శంకరపట్నం మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ఆందోళనలో పాల్గొన్న ఆయనపై పోలీస్ కేసు నమోదైంది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన నాగయ్య ప్రజా సేవలో తనదైన ముద్ర వేశారు. ఆయన భార్య వసంతను తాడికల్ సహకార సంఘం డైరెక్టర్‌గా, ముత్తారంకన్నాపూర్ ఎంపీటీసీ సభ్యురాలిగా గెలిపించడంలో కీలకంగా వ్యవహరించారు. మండలంలో 'టీఆర్ఎస్ నాగయ్య'గా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు భార్య వసంతతో పాటు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. బుధవారం నిర్వహించిన నాగయ్య అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొన్నారు. నాగయ్య పాడెను మోసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నాగయ్య మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలి

- పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



**కాకతీయ, భూపాలపల్లి :** రోడ్డు విస్తరణలో భాగంగా ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న పేదల దుకాణాలను ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు ఎవరూ వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో పేద చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయడం సరికాదన్నారు. కూరగాయలు, పండ్లు, చికెన్ సెంటర్లు, టీ స్టాల్స్, సెలూన్లు తదితర వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ స్థలాలు కల్పించి, జీవనోపాధికి భరోసా ఇచ్చిన తర్వాతే తొలగింపు చర్యలు చేపట్టాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణ అభివృద్ధిలో భాగంగా టెండర్లు పిలిచి ప్రారంభించిన అనేక పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 3 సంవత్సరాలు అవుతున్నా ఆ పనులను ఎందుకు నిలిపివేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో భూపాలపల్లి పట్టణంలోని పేదల కోసం సుమారు 1,000 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించగా, అందులో సుమారు 500 ఇళ్లను తమ హయాంలోనే పేద కుటుంబాలకు అందించామని గండ్ర తెలిపారు. 4 సంవత్సరాలుగా ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ఇళ్లను ఆసరాగా చేసుకుని మధ్యవర్తులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేదలను ఇబ్బందులకు గురిచేసే చర్యలను నిలిపివేసి, వారి జీవనోపాధికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

## సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి
- పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశం



**కాకతీయ, నెల్లికుదురు:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. బుధవారం నెల్లికుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థల్లో వంట సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు సకాలంలో వేయాలని సూచించారు. మందుల నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలని, బోదకాలు, గర్భాశయ క్యాన్సర్ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ ప్రతి సబ్జెక్టుపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ నుంచే భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించాలని, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో కుమార్, ప్రిన్సిపల్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



## వాగ్దేవి స్కూల్లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్

**కాకతీయ, ఇనుగుర్తి:** ఇనుగుర్తి మండల కేంద్రంలోని వాగ్దేవి కాన్సెప్ట్ స్కూల్‌లో బుధవారం సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. 120కి పైగా ఎగ్జిబిట్లను విద్యార్థులు ప్రదర్శించారు. స్థానిక ఎస్సై నరేష్ రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులతో ముచ్చటించారు. సర్పంచ్ తమ్మడపల్లి కుమార్, స్కూల్ కరస్పాండెంట్ చిన్నాల కట్టయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలపై ఆసక్తిని పెంచుతాయని అన్నారు. పర్యావరణం, శక్తి, ఆరోగ్యం, వైద్యం, అతివృష్టి, అనావృష్టి తదితర సమస్యలకు పరిష్కారాలను సూచించే ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు కవిత, మానస, మాధవి, సబియా బేగం, రామ్ సలీం, వార్డు సభ్యుడు శ్రీకాంత్, అనూష, మార్కెట్ డైరెక్టర్ కొట్టం రాము, అధ్యాపకులు శిరీష, అప్సర, నవ్య, షాయిన్, శ్రీలత, స్రవంతి పాల్గొన్నారు.

## లెంకపల్లి సర్పంచ్ కుటుంబాన్ని ఫోన్లో పరామర్శించిన హరీశ్‌రావు



**కాకతీయ, నర్సంపేట:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లెంకపల్లి సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి-రవీందర్ కుటుంబాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్లో పరామర్శించారు. ఈ విషయాన్ని మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రవీందర్ కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడిన హరీశ్‌రావు వారిని ఓదార్చారు. అధైర్యపడవద్దని, పార్టీ, తాము అన్ని విషయాల్లో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన సహాయంపై కూడా భరోసా కల్పించారు.

## టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఎన్నిక



**కాకతీయ, నెల్లికుదురు :** టీయూడబ్ల్యూజే 143 నెల్లికుదురు మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కోఆర్డినేటర్ గాడిపెల్లి శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు జంపాల చక్రధర్ పర్యవేక్షణలో నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మన తెలంగాణకు చెందిన మద్ది వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా సాక్షి విలేకరి బైరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఆంధ్రజ్యోతి కంట్రిబ్యూటర్ మల్యాల నరసయ్య, సహాయ కార్యదర్శిగా నమస్తే తెలంగాణ జర్నలిస్టు మస్కపురి సుధాకర్, కోశాధికారిగా జెల్ల ఉపేందర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ప్రజాజ్యోతి రిపోర్టర్ పోరండ్ల లక్ష్మయ్య, బహుజన టీవీ విలేకరి జిలకర శ్రీధర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకులు, మండల విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

## స్వచ్ఛ సేవకుల ఆరోగ్యమే జీడబ్ల్యూఎంసీ ధ్యేయం

- పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు
- ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న వెల్లడి



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** నగర పారిశుద్ధ్యానికి వెన్నెముకగా నిలుస్తున్న స్వచ్ఛ సేవకుల ఆరోగ్య పరిరక్షణకు జీడబ్ల్యూఎంసీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కమిషనర్ టి. వెంకన్న తెలిపారు. 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, యూపీహెచ్‌సీల వైద్య సిబ్బందితో రక్త పరీక్షలు, ఇతర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికుడికి హెల్త్ కార్డు అందజేసి ఆరోగ్య వివరాలను నమోదు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య శిబిరాలు నిర్వహించడంతోపాటు సమీప యూపీహెచ్‌సీల ద్వారా ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామన్నారు. సఫాయి మిత్రలకు పీపీఈ కిట్లు, ర్యాగ్ పిక్కర్లు, వ్యర్థాల సేకరణ కార్మికులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. తడి, పొడి చెత్త వేర్పాటులో చురుగ్గా పనిచేస్తున్న ఇద్దరు స్వచ్ఛ ఆటో డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు



- దామోదరస్వామి సేవలు మరువలేనివి
- గిరిజనుల అభ్యున్నతికి 38 ఏళ్ల విశేష సేవలు
- ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పో ప్రశంస

**కాకతీయ, ఏటూరునాగారం రూరల్:** ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు పొందుతారని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. ఏపీఓగా దామోదరస్వామి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం దామోదరస్వామి పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరస్వామి, ఆయన సతీమణి పద్మ దంపతులను పీఓతో పాటు అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. దామోదరస్వామి సుమారు 38 ఏళ్లపాటు ఏటూరునాగారం ప్రాంతంలో పనిచేస్తూ గిరిజనుల అభ్యున్నతికి విశేష సేవలందించారని పీఓ తెలిపారు. 1988 నుంచి వివిధ ప్రాంతాల్లోని ఐటీడీఏల్లో విధులు నిర్వర్తించి, తిరిగి ఏటూరునాగారంలోనే పదవీ విరమణ పొందడం విశేషమన్నారు. కార్యాలయంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. దంపతులు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ అనంతరం కూడా గిరిజనుల కోసం సేవలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఉట్నూరు ఏపీఓ వసంతరావు, డీటీడీఓలు దేశిరాం, నాగసాగర్, మేనేజర్ శ్రీనివాస్, ఐటీడీఏ డీడీ జనార్ధన్, ఈఈ ప్రవీణ, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమల, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ఐక్యంగా ముందుకు సాగుదాం



- కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేద్దాం
- టీబ్ల్యూడబ్ల్యూయూ–ఎస్‌డబ్ల్యూఎఫ్ కూటమికి మద్దతివ్వాలి
- వర్కర్స్ తెలంగాణ యూనియన్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి పిలుపు

**కాకతీయ, వరంగల్:** ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలని వర్కర్స్ తెలంగాణ యూనియన్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు, సంక్షేమం, హక్కుల పరిరక్షణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు మేరకు టబ్ల్యూడబ్ల్యూయూ-ఎస్‌డబ్ల్యూఎఫ్ కూటమి బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రీజియన్ అధ్యక్షుడు హోదాలో జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బొంతు రామ్మోహన్, అశ్వత్థామరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పాల్గొని ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడారు. కార్మికుల ఐక్యతే బలమని, హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టబ్ల్యూడబ్ల్యూయూ జిల్లా కార్యదర్శి జితేందర్‌రెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి ఉపేందర్‌చారి, పి. ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

- రేవంత్ సర్కార్‌కు అనస్థీషియా తప్పదు
- కాంగ్రెస్ హామీలన్నీ మోసాలేనని ప్రజలు గుర్తించారు
- నా పనితీరే నా రాజకీయ ఎదుగుదలకు కారణం
- భూపాలపల్లే నాకుటుంబం.. మళ్లీ పాదయాత్రతో ప్రజల్లోకి
- నా రాజకీయ ప్రయాణంలో అనేక కుట్రలు ఎదుర్కొన్నా
- రెండు సార్లు మంత్రి పదవి వచ్చినట్లే వచ్చి చేజారింది
- ప్రజలతో నేరుగా సత్సంబంధాలే నా రాజకీయ బలమని నమ్ముతా
- నా కొడుకు గౌతమ్ రాజకీయాల్లోకి వస్తానంటే స్వాగతిస్తా

డిజిటల్ మీడియా ప్రతినిధుల చిట్‌చాట్‌లో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి





# ప్రజలతో బంధమే నా బలం

## రెండు సార్లు మంత్రి పదవి చేజారింది

2004లో తెలుగుదేశం పార్టీ నుంచి టికెట్ ఆఫర్ వచ్చింది. కానీ నా రాజకీయ జీవితమంతా ఆ పార్టీకి వ్యతిరేకంగా పోరాడాను. కేవలం టికెట్ కోసం ఆ పార్టీలో చేరడం నాకు సరికాదనిపించింది. అయితే ఎన్టీఆర్ అంటే నాకు వ్యక్తిగతంగా అభిమానం ఉంది. నటుడిగా ఆయనను ఎంతో ఇష్టపడేవాడిని. పరిపాలనలో ఆయన తీసుకొచ్చిన మార్పులను కూడా మా తరం చూసింది. నేను రెండుసార్లు కరువు పరిస్థితులను చూశాను. 2007లో ఎమ్మెల్సీగా గెలవడం మరో కీలక మలుపు. వైఎస్ నన్ను హనుమకొండ అసెంబ్లీ నుంచి పోటీ చేయించాలని భావించారు. తర్వాత వరంగల్ ఎంపీగా పోటీ చేసే అవకాశం కూడా వచ్చింది. టికెట్ విషయంలో నా పేరు ముందుకు వచ్చింది. కానీ రాజకీయ పరిణామాలతో రెండు ఎంపీ టికెట్లు అప్పటి తెరాసకు కేటాయించారు. ఆ తర్వాత అసెంబ్లీ, ఎమ్మెల్సీ స్థానాల విషయంలోనూ అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. చివరకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేశాను. కాంగ్రెస్ బలం తక్కువగా ఉండటంతో నేను ఓడిపోతానని చాలామంది అనుకున్నారు. కానీ కేసీఆర్ మాట ప్రకారం తెరాస పూర్తిగా మద్దతు ఇచ్చింది. నేను 115 ఓట్ల మెజారిటీతో గెలిచాను. 2011లో మంత్రిపదవి వస్తుందని చివరి వరకు అనుకున్నాను. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి 'మీ పేరు వచ్చింది.. అయిపోయింది' అని చెప్పారు. మరుసటి రోజు గవర్నర్ ప్రమాణస్వీకారం ఉంటుందని భావించాం. కానీ ఉదయం నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. చివరకు ప్రమాణస్వీకారం జరిగింది. నా పేరు ఎందుకు మిస్ అయిందని రోశయ్య కూడా అడిగారు. మరోసారి మంత్రివర్గ విస్తరణలోనూ అవకాశం వచ్చింది అనుకున్నా చివరి నిమిషంలో చేజారింది. స్థానిక రాజకీయ కుట్రలు కూడా అందులో భాగమయ్యాయి. అయినా 2012లో ప్రభుత్వ చీఫ్‌విప్‌గా బాధ్యతలు చేపట్టాను. నా రాజకీయ ఎదుగుదలను ఎవరూ పూర్తిగా ఆపలేరు. అవకాశాలు ఆలస్యమవుతాయి.. కానీ పోరాటం ఆపకూడదు.

## నా పనితీరే నా రాజకీయ ఎదుగుదలకు కారణం

నాకు రాజకీయ నేపథ్యం లేదు. నా ఎదుగుదల వెనుక కుటుంబ రాజకీయ వారసత్వం లేదు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొంటూ రాజకీయాల్లోకి వచ్చాను. పాలిటెక్నిక్‌లో చదువుతున్న సమయంలోనే విద్యార్థి నాయకుడిగా పనిచేశాను. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేశాం. ఆ ఉద్యమాల కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు వచ్చేలా పోరాటం చేశాం. ఆ పోరాటంలో నేను ఒక విద్యా సంవత్సరం కోల్పోయాను. ఉద్యమాలు ఎక్కువ కావడంతో కాలేజీ మార్చాల్సి వచ్చింది. అదే కాలేజీలో పీజేఆర్ కూడా చదివారు. అప్పటి ప్రిన్సిపాల్ నాతో 'పీజేఆర్ నాయకుడయ్యారు.. నువ్వూ నాయకుడవుతావు' అని చెప్పేవారు. ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించిన సమయంలో బస్సుల టైర్లు గాలి తీసిన ఉద్యమంలోనూ పాల్గొన్నాను. అప్పట్లో నా తీరు చాలా దూకుడుగా ఉండేది. హయగ్రీవాచారి ఒకసారి నా ప్రవర్తనను మందలించారు. కానీ ఆ పోరాట స్వభావమే తర్వాత నా రాజకీయ జీవితానికి పునాదిగా మారింది. రాజకీయాల్లో ఎదగడానికి ఎలాంటి రాజకీయ వారసత్వం నాకు లేదు. నా పనితీరే నా ఎదుగుదలకు కారణం. రాజకీయాల్లో కుట్రలు సహజం. తడిగుడ్డతో గొంతు కోస్తారు. నవ్వుతూనే ప్రాణం తీస్తారు. నన్ను రాజకీయంగా అణగదొక్కేందుకు, అవకాశాలు రాకుండా చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయినా నేను వెనక్కి తగ్గలేదు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలే ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు బీమా, పెన్షన్లు, మహిళలకు రూ.2,500 హామీ, యూరియా సమస్యలపై ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పాదయాత్ర చేపట్టి ప్రజలను నేరుగా కలుస్తానని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన పరిణామాలు, పదవులు చేజారిన సందర్భాలు, భూపాలపల్లి అభివృద్ధి, బీఆర్ఎస్‌లో చేరిక, కుటుంబం, భవిష్యత్ రాజకీయ అడుగులపై తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

## హామీలన్నీ మోసాలేనని ప్రజలు గుర్తించారు

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల పరిస్థితి ఏమిటన్నది ప్రజలే చూస్తున్నారు. రైతులు తమ పరిస్థితి ఎలా ఉందో చెప్పగలరు. రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాల విషయంలో ప్రజల్లో చర్చ జరుగుతోంది. పెన్షన్ల విషయంలోనూ సమస్యలు ఉన్నాయి. మహిళలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ పరిస్థితి ఏమిటన్నది మహిళలే చెబుతున్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలా అన్ని వర్గాల్లో సమస్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. ఎవరేం చెప్పారు.. అధికారంలోకి వచ్చాక ఏం చేశారు.. అన్న విషయాలను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు. ఈ హామీలు మోసాలేనని ప్రజలు గుర్తిస్తున్నారని నేను భావిస్తున్నాను. ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులయ్యారు. ఇక రేవంత్ సర్కార్‌ను అనస్థీషియా ఇచ్చి మళ్లీ పడుకోబెట్టే కాలం దగ్గర్లోనే ఉంది.

## మళ్లీ పాదయాత్ర చేస్తా

నా రాజకీయ ప్రస్థానంలో భూపాలపల్లికి ప్రత్యేక స్థానం ఉంది. భూపాలపల్లి నుంచి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. ఆ ప్రాంతంతో నా అనుబంధం కేవలం రాజకీయానికి పరిమితం కాదు. నా కుటుంబంతో, నా జీవిత ప్రయాణంతో భూపాలపల్లి ముడిపడి ఉంది. అక్కడి ప్రజల సమస్యలు నాకు తెలుసు. భూపాలపల్లి మిశ్రమ జనాభా ఉన్న ప్రాంతం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు, వలస వచ్చిన ప్రజలు అక్కడ ఉన్నారు. అందరి అవసరాలు, సమస్యలు ఒకేలా ఉండవు. అందుకే ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవాలి. రానున్న రోజుల్లో నియోజకవర్గమంతా పాదయాత్ర చేస్తాను. గ్రామగ్రామాన తిరుగుతాను. ప్రజలను కలుస్తాను. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమిటి.. వాటిలో ఏవి అమలయ్యాయి.. ఏ సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు.. నా హయాంలో ఏం చేశాను.. అనే విషయాలను ప్రజల ముందుంచుతాను. రాజకీయాల్లో ప్రజలతో నిరంతర సంబంధమే అసలైన బలం. ప్రజలకు దూరంగా ఉండి రాజకీయాలు చేయలేం. నేరుగా ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలు వినడం, వాటిపై స్పందించడం, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడాన్నే నేను నా రాజకీయ బలంగా భావిస్తాను.

## పదమూడేళ్లు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేశా

1989 నుంచి పూర్తి స్థాయిలో రాజకీయాల్లో కొనసాగుతున్నాను. జిల్లా స్థాయిలో యువజన కాంగ్రెస్‌లో పనిచేశాను. ఆ సమయంలో నక్సలైట్ ప్రభావం ఎక్కువగా ఉండేది. మా ఇల్లు రోడ్డుపక్కనే ఉండేది. రాజకీయాల్లో చురుగ్గా పనిచేస్తున్న సమయంలో నన్ను తీసుకెళ్లారు. మా ఇంటిని పేల్చేశారు. మొదట మా నాన్న రాజకీయాల్లోకి రావడాన్ని వ్యతిరేకించారు. కానీ నా పట్టుదల, పోరాటం చూసి తర్వాత నాకు మద్దతుగా నిలిచారు. 1999లో అసెంబ్లీ టికెట్ కోసం ప్రయత్నించాను. టికెట్ రాలేదు. 2001లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాను. పదమూడేళ్లు ఆ పదవిలో కొనసాగాను. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నిరంతరం పనిచేశాను. అప్పట్లో సామాజిక మాధ్యమాలు లేవు. టీవీలు, పత్రికలే ప్రధాన ప్రచార వేదికలు. ప్రతిరోజూ కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాను. 2004లో పార్టీ అధికారంలోకి రావడంలో నా వంతు కృషి చేశాను. 2014 వరకు డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగాను. నన్నెవరూ పదవి నుంచి తొలగించలేదు. నేనే తప్పుకున్నాను. పార్టీ కోసం పనిచేస్తే పదవులు వస్తాయా రావా అనేది తర్వాతి విషయం. ముందుగా పార్టీ కోసం మనం ఎంత పని చేశామన్నదే ముఖ్యం అని నేను నమ్ముతాను.

### కేసీఆర్, కేటీఆర్‌తో అనుబంధం

2019లో పరిస్థితుల కారణంగా బీఆర్ఎస్‌లో చేరాను. ఉద్యమ కాలం నుంచే కేటీఆర్‌తో నాకు పరిచయం ఉంది. కేసీఆర్‌తో కూడా మంచి సంబంధం ఉంది. కేసీఆర్ పనిచేసే విధానం ఇతరులకంటే భిన్నంగా ఉంటుంది. ఆయనను కలవడం కష్టమని చాలామంది అంటారు. కానీ ఒకసారి కలిసిన తర్వాత సమస్యను పరిష్కరించడంలో ఆయన వేగం వేరుగా ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న పనులను క్లియర్ చేయించగలుగుతారు. ఒక్కోసారి అరగంట, గంట మాట్లాడతారు. మరికొన్ని సందర్భాల్లో రోజంతా లేదా రోజులో చాలా సమయం చర్చిస్తారు. ఏ అంశంపైనైనా లోతైన అవగాహనతో మాట్లాడగలరు. ఉద్యమ కాలం నుంచే ఆయనతో నాకు పరిచయం ఉంది. అందుకే ఆయన రాజకీయ వ్యవహార శైలిని దగ్గరగా చూశాను. రాజకీయాల్లో పరిస్థితులు మారుతుంటాయి. కానీ ప్రజలతో సంబంధం, పార్టీ కోసం పనిచేసిన అనుభవం మాత్రం ఎప్పటికీ ఉంటుంది. రాజకీయాల్లో ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉన్నారన్నదానికంటే, ప్రజలతో మన అనుబంధం ఎలా ఉందన్నదే చివరికి ముఖ్యమని నేను భావిస్తాను.



### భూపాలపల్లి అభివృద్ధే నా లక్ష్యం

నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు భూపాలపల్లి ఎన్నో సమస్యలతో ఉండేది. అప్పట్లో విద్య, వైద్య రంగాల్లో కూడా తగిన సదుపాయాలు లేవు. డిగ్రీ కళాశాల, ఇంటర్మీడియట్ కళాశాలలు తీసుకొచ్చాం. మొదట అక్కడ పీహెచ్‌సీ మాత్రమే ఉండేది. ఇప్పుడు వైద్య కళాశాల, వంద పడకల ఆసుపత్రి ఉన్నాయి. సింగరేణి కార్మికుల కోసం రెండు వేల క్వార్టర్ల నిర్మాణం జరిగింది. చెక్‌డ్యామ్‌లు, ఎత్తిపోతల పథకాలు, రహదారుల విస్తరణ వంటి అనేక పనులు జరిగాయి. బైపాస్ రహదారికి అనుమతి వచ్చినా అది ఇంకా పూర్తి కాలేదు. అన్ని సమస్యలను పరిష్కరించానని నేను చెప్పను. ఇంకా కొన్ని ప్రధాన సమస్యలు ఉన్నాయి. కానీ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు తీసుకురావడంలో నేను ముందుండేవాడిని. అవసరమైన నిధుల కోసం అధికారులను, ప్రభుత్వ పెద్దలను కలిసేవాడిని. భూపాలపల్లికి ఏ పని అవసరమో గుర్తించి దాని కోసం పోరాడేవాడిని. ప్రజల అవసరాలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించేందుకు ప్రయత్నించేవాడిని. అందుకే నా రాజకీయ ప్రయాణం మొత్తం భూపాలపల్లితో ముడిపడి ఉంది. నా కుటుంబం భూపాలపల్లే. అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. మరోసారి అవకాశం వస్తే భూపాలపల్లిని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలబెట్టేందుకు కృషి చేస్తాను.

## రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యం ఎక్కువైంది..!

మా కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబం కాదు. చిన్నతనంలో పెద్దగా ఆర్థిక సమస్యలు ఎదుర్కోలేదు. కానీ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత డబ్బు ప్రాధాన్యం ఏమిటో అర్థమైంది. రాజకీయ ప్రయాణంలో డబ్బు కూడా ఒక ముఖ్యమైన అంశంగా మారింది. అందుకే వ్యాపార రంగంలోకి కూడా వెళ్లాను. చిన్నప్పటి నుంచే వ్యవసాయంపై నాకు మంచి ఆసక్తి. ఇప్పటికీ సమయం దొరికితే పొలానికి వెళ్తాను. వ్యవసాయ పనులు నాకు తెలుసు. ఒకప్పుడు మా పొలాల్లో పనిచేసే కూలీలు పంటకాలంలో వేతనం లేకుండా కూడా సహాయం చేసేవారు. వాళ్లు ఆహారం అడిగితే జొన్నలు ఇచ్చేవాళ్లం. అప్పటి సామాజిక సంబంధాలు వేరు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నా భార్య గండ్ర జ్యోతి నా రాజకీయ జీవితంలో నాకు పూర్తి అండగా నిలిచారు. 2005లో రిజర్వేషన్ కారణంగా ఆమెను వరంగల్ మేయర్‌గా చేయాలని ప్రయత్నించాను. వైఎస్‌తో మాట్లాడి ఆ దిశగా ముందుకు వెళ్లాను. కానీ రాజకీయ పరిణామాలతో ఆ అవకాశం కూడా చేజారింది. రాజకీయాల్లో పైకి వస్తున్న వారిని ఆపేందుకు నిశ్శబ్దంగా జరిగే కుట్రలు ఉంటాయి. గండ్ర జ్యోతి ఇప్పటికే వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లు వస్తే ఆమె అసెంబ్లీకి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నా కుమారుడు గౌతమ్ రాజకీయాల్లోకి రావాలా వద్దా అన్నది అతని నిర్ణయమే. వస్తే స్వాగతిస్తాను. ఎప్పుడు వచ్చినా నేను వద్దనను. రాబోయే రోజుల్లో అతను కేటీఆర్ బృందంలో ఉంటాడని అనుకుంటున్నా. నా రాజకీయ ప్రస్థానం పోరాటాలతోనే సాగింది. ఇకపైన కూడా అదే పంథాలోనే ముందుకు సాగుతా. భవిష్యత్తులోనూ ప్రజల మధ్యే ఉంటాను. భూపాలపల్లి అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నా వంతు రాజకీయ పోరాటం కొనసాగిస్తాను.



ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266